క్లుప్తంగా

అల్లిమెరకలో బోధన భేష్



అల్లిమెరకలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ లక్ష్మణరావు

మందస: మండలంలోని అల్లిమెరక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఓ మంచి అభ్యసన కేంద్రమని ఎంఈఓ ఎం.లక్ష్మణరావు అన్నారు. పలు పాఠశాలల పనితీరును మంగళవారం పరిశీలించారు. అల్లిమెరక పాఠశాలలో ఉపాధ్యాయులు అనుసరిస్తున్న విద్యాబోధన, తీసుకుంటున్న ప్రణాళిక చర్యలను అభినందించారు. విద్యార్థుల వర్క్‌బుక్స్, డైరీ, తల్లిదండ్రుల అభిప్రాయాలు, సంతకాలు, నవోదయ, ఇతర పరీక్షలకు శిక్షణ చక్కగా అమలు చేస్తున్నారని కొనియాడారు. బడితోట, మొక్కలు పెంపకం తదితర అంశాలను ఇతర పాఠశాలలు ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎస్.శ్రీహర్ష, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరం వీరగున్నమ్మపురం, డిమిరియా, జిల్లుండ పాఠశాల పనితీరు పరిశీలించారు.

తాగునీటి సమస్యలు రాకుండా చర్యలు



మాట్లాడుతున్న ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్

సోంపేట: వేసవి నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ అధికారులకు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి బోర్లకు మరమ్మతులు చేయించాలన్నారు. ఉద్దానం మంచినీటి పథకం ద్వారా ప్రతి రోజు సక్రమంగా నీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. జగనన్న కాలనీల్లో ముఖ ద్వారాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎంపీడీఓ బెందాళం వెంకటరమణ, హౌసింగ్ డీఈ రామకృష్ణ, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈలు అబ్బాస్, ప్రసాద్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

108 ఉద్యోగులకు సన్మానం



ఉద్యోగులను సన్మానిస్తున్న దృశ్యం

టెక్కలి రూరల్: హైరిస్క్ ప్రెగ్నెన్సీ పురిటి నొప్పులతో బాధపడిన మందస మండలానికి చెందిన గిరిజన మహిళ దేవాకి నాయక్‌ను టెక్కలికి చెందిన 108 ఉద్యోగి హెచ్.జగదీశ్వరరావు(ఈఎంటీ), పైలట్ దుర్గారావులు 108 వాహనంలోనే అతికష్టంపై ప్రసవం చేయించి తల్లీబిడ్డల ప్రాణాలను కాపాడారు. ఈ నేపథ్యంలో మంగళవారం స్థానిక సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో వీరిని సన్మానించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ జిల్లా సహాయ కన్వీనర్ కె.రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామనవమి ఉత్సవాల్లో జెడ్పీ చైర్‌పర్సన్



సీతారాములను దర్శించుకుంటున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ

కంచిలి: మండలంలోని తలతంపరలో నిర్వహిస్తున్న శ్రీరామ నవమి ఉత్సవాల్లో జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ మంగళవారం పాల్గొన్నారు. సీతారాములను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడు లడ్డుకేశవ పాత్రో, సర్పంచ్ జగబంధు దొళాయి, ఎంపీటీసీ సభ్యుడు బృందావన్ సాహు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎస్‌ఐ రామకృష్ణ

ఇచ్ఛాపురం రూరల్: మండపల్లి తోటూరు రైల్వే గేట్ వద్ద యువసూర్య చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని రూరల్ ఎస్‌ఐ రామకృష్ణ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ట్రస్టు చైర్మన్, న్యాయవాది ఎం.రాంబాబు మాట్లాడుతూ 17 ఏళ్ల నుంచి చేస్తున్న సమాజసేవలు వివరించారు. కార్యక్రమంలో హెచ్‌సీ రామారావు, చిన్ని భైరి, కె.గోపి, కె.నారాయణ, ఈశ్వర్‌రావు, కె.దేవరాజ్, వరదరాజు, శ్రీను, అభిమన్యు సాహు, చరణ్ పాల్గొన్నారు.

మహిళా సాధికారతే ధ్యేయం

- జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ
- మూడోవిడత వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ



మహిళలకు చెక్కు అందజేస్తున్న, జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ

ఇచ్ఛాపురం: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళా సాధికారత కోసం కృషి చేస్తున్నారని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. వైఎస్సార్ ఆసరా సంబరాల్లో భాగంగా మంగళవారం ఇచ్ఛాపురం పట్టణంలోని ప్రజాప్రస్థానం విజయవాటిక, వైఎస్సార్ టూరిజం పార్కు ఆవరణలో స్వయం సహాయక సంఘాల సభ్యులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం జగనన్న ప్రజాసంకల్ప యాత్రలో అక్కచెల్లెమ్మల కష్టాలను స్వయంగా తెలుసుకొని మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. అనంతరం పట్టణంలోని 585 గ్రూపులకు చెందిన 5361 మంది డ్వాక్రా మహిళలకు రూ.13.15 కోట్ల చెక్కును చైర్‌పర్సన్ అందజేశారు. డ్వాక్రా మహిళలతో కలిసి సీఎం వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో సీడాప్ చైర్మన్ శ్యామ్‌ప్రసాద్ రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ సల్లా సుగుణ, మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి, వైస్ చైర్‌పర్సన్లు ఉలాల భారతిదివ్య, లాభాల స్వర్ణమణి, ప్రచార విభాగ జిల్లా అధ్యక్షుడు తాడి ఆదిరెడ్డి, క్రిస్టియన్ మైనారిటీ సెల్ అధ్యక్షులు ప్రత్తి అన్వేష్, జేసీఎస్ కన్వీనర్ సాలిన ఢిల్లీ, మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్, మెప్మా సీఎంఎం జానకి రామారావు కౌన్సిలర్లు మధుమూర్తి, బి.జగన్, తేజేశ్వరరావు, పార్టీ నాయకులు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

మే 30న కంచమ్మతల్లి చల్లదన మహోత్సవం



సమావేశంలో చర్చిస్తున్న కమిటీ సభ్యులు

కంచిలి: కంచమ్మతల్లి అమ్మవారి చల్లదనం మహోత్సవాన్ని మే 30న నిర్వహించడానికి ఆలయ అభివృద్ధి కమిటీ, దత్తత గ్రామాల భక్తులు నిర్ణయించారు. ఈ మేరకు కంచిలి రైల్వే స్టేషన్ ఆవరణలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో తీర్మానించారు. అదేరోజున అమ్మవారికి బంగారు వడ్డానం తయారుచేసి అలంకరించాలని నిర్ణయించారు. ఇందుకోసం అవసరమైన బంగారాన్ని విరాళంగా ఇవ్వడానికి పలువురు భక్తులు ముందుకొచ్చారు. సమావేశంలో ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు, దత్తత గ్రామాల పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి



ఎమ్మెల్సీ నర్తు రామారావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న అధికారులు

కవిటి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న కాలనీలు, వ్యక్తిగత స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. మంగళవారం కొత్తపుట్టుగలోని తన నివాసంలో ఇచ్ఛాపురం నియోజకవర్గ గృహనిర్మాణశాఖ డీఈఈ రామకృష్ణ నేతృత్వంలో నాలుగు మండలాల హౌసింగ్ ఇంజనీర్లు సాయికిరణ్, అమర్, అప్పారావు, మహిమాప్రసాద్, వర్క్ ఇన్‌స్పెక్టర్లు కలిసి ఎమ్మెల్సీగా ఎన్నికైన సందర్భంగా పుష్పగుచ్ఛాన్ని అందించి శుభాకాంక్షలు తెలిపారు.

కమ్యూనిటీ భవనానికి నిధులివ్వాలని వినతి



చైర్‌పర్సన్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయీబ్రాహ్మణ సంఘం ప్రతినిధులు

కవిటి: మండలంలోని నాయీబ్రాహ్మణుల సంఘానికి భవనం లేక సమావేశాలు ఏర్పాటు చేసుకునేందుకు ఇబ్బందులు పడుతున్నామని సంఘం మండల నాయకులు శ్రీకాకుళం జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ దృష్టికి తీసుకొచ్చారు. మంగళవారం బల్లిపుట్టుగలోని ఆమె నివాసంలో కలిసి సంఘ భవననిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. జగతి పంచాయతీలో తమకున్న స్థలంలో తమ సంఘసభ్యులు, సామాజిక కార్యక్రమాల కోసం ఓ భవనం నిర్మాణానికి నిధులు ఇవ్వాలని విన్నవించారు. దీనిపై ఆమె సానుకూలంగా స్పందించి ప్రాధాన్యతాక్రమంలో నిధుల కేటాయింపునకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

మున్సిపల్ కమిషనర్‌కు సత్కారం



కమిషనర్ రాజగోపాలరావును సన్మానిస్తున్న సచివాలయ ఉద్యోగులు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపల్ కమిషనర్ టి.రాజగోపాలరావును మంగళవారం పలాసలోని ఓ కల్యాణ మండపంలో ఘనంగా సత్కరించారు. మూడేళ్లకుపైగా కమిషనర్‌గా సేవలందించి జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతిపై వెళ్తున్న సందర్భంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గాలి ముకుందరావు, కార్యదర్శి ఎం.హేమశంకర్, నవీన్ కుమార్, నారాయణరావు, సుజాత తదితరులు పాల్గొన్నారు.

గృహ పథకం పేదలకు వరం

కవిటి: గృహ నిర్మాణ పథకం సొంత ఇల్లులేని పేదలకు ఓ వరమని హౌసింగ్ ఇంజినీర్ సాయికిరణ్ అన్నారు. రాజపురంలో మంగళవారం గృహనిర్మాణ పథకం లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. సోషల్ మొబిలైజర్ చెన్నూరు మల్లేశ్వరరావు లబ్ధిదారులకు పథకంపై సమగ్ర అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కడియాల ప్రకాష్, సనపల జానకిరావు, కృష్ణారావు, నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల లబ్ధిని వివరించాలి



కవిటి: మాట్లాడుతున్న జేసీఎస్ మండల కన్వీనర్ జల్లు యుగంధర్



టెక్కలి: లింగాలవలసలో కిట్లు అందజేస్తున్న జేసీఎస్ ఇన్‌చార్జి, నాయకులు

టెక్కలి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందజేసిన నవరత్నాల పథకాలతో కలిగిన లబ్ధిని ప్రతీ గడపకూ వివరించాలని మండల జేసీఎస్ ఇన్‌చార్జి శిగిలిపల్లి మోహన్ అన్నారు. మంగళవారం లింగాలవలస, పోలవరం, తిర్లంగి తదితర గ్రామ సచివాలయాల పరిధిలో గృహ సారథులు, వలంటీర్లతో 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి సచివాలయం పరిధిలో ప్రభుత్వం అందజేసిన నవరత్నాల పథకాలను వివరించారు. అనంతరం జగనన్నే మా భవిష్యత్ కిట్లు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సంపతిరావు రాఘవరావు, నాయకులు ఎస్.ఉమాపతి, కమలాకర్, టి.జగ్గారావు, బి.రాజేష్, బి.బలుసు, ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

7 నుంచి జగనన్నే మన భవిష్యత్

కవిటి: ఈ నెల 7 నుంచి 20 వరకు జరగనున్న జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమానికి పూర్తి కార్యాచరణతో యంత్రాంగం సమాయత్తం కావాలని జేసీఎస్ మండల కన్వీనర్ జల్లు యుగంధర్ అన్నారు. మంగళవారం రాజపురం సచివాలయంలో సర్పంచ్ సనపల జానకిరావు అధ్యక్షతన నిర్వహించిన సమన్వయ కమిటీ సమావేశంలో యుగంధర్, మండల పార్టీ కన్వీనర్ కడియాల ప్రకాష్ మాట్లాడారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, గ్రామ వలంటీర్లు సంఘటితంగా ముందుకు సాగాలన్నారు. ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్లలో పేదలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. పథకాల పంపిణీకి అర్హతే ప్రామాణికంగా తీసుకున్న విషయాన్ని బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. సంక్షేమానికి రాజకీయాలు జోడించకుండా పేదలకు పథకాలు అందిస్తున్న తీరును వివరించాలన్నారు. సమావేశంలో పార్టీ నేతలు, ఎంపీటీసీ కృష్ణారావు, పాండవ శేఖర్, ఎన్ని అశోక్, బొర్ర రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్నే మా భవిష్యత్‌పై సమీక్ష..

ఇచ్ఛాపురం: ఈ నెల 7 నుంచి నిర్వహించనున్న జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంపై మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి సమీక్ష నిర్వహించారు. కార్యక్రమం విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ సాలిన ఢిల్లీ, ప్రచార విభాగ జిల్లా అధ్యక్షుడు తాడి ఆదిరెడ్డి, ఆయా వార్డు కౌన్సిలర్లు సీహెచ్ జగన్నాయకులు, నాయకులు పరపటి కోటి రెడ్డి, ప్రకాశరావు పట్నాయక్, షఫీ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం రూరల్: ప్రజా సంక్షేమమే జగనన్న ప్రభుత్వ ధ్యేయమని మండల సచివాలయ జేసీఎస్ ఇన్‌చార్జి ఆశి పురుషోత్తంరెడ్డి అన్నారు. మండపల్లి, బాలకృష్ణాపురం, కేదారిపురం, అరకభద్ర సచివాలయాల పరిధిలో 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. సమావేశాల్లో మాజీ ఎంపీపీ కారంగి మోహనరావు, ఉప్పాడ రాజారెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు దక్కత నూకయ్యరెడ్డి, పార్టీ జనరల్ సెక్రటరీ చిట్టిబాబు, మాజీ సర్పంచ్ మోహన్‌దాసు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



మాట్లాడుతున్న మందస వైద్యాధికారి డాక్టర్ సంపత్‌రావు

మందస: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మందస వైద్యాధికారులు డాక్టర్ మద్దిల సంపత్‌రావు, డాక్టర్ టి.శైలజ సిబ్బందికి సూచించారు. మందస వైఎస్సార్ క్రాంతిపథం కార్యాలయంలో మంగళవారం వైద్యులు, సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఎండాకాలంలో వర్షాలు పడుతుండడంతో సీజనల్ వ్యాధులు వ్యాపించే అవకాశముందన్నారు. ఫీవర్ సర్వే చేయాలని ఆదేశించారు. ప్రధానమంత్రి మాతృత్వ సంరక్షణ, సురక్షాపథకం పక్కాగా అమలు చేయించాలన్నారు. సమావేశంలో హెల్త్ ఎడ్యుకేటర్ డి.మంగమ్మ, పీహెచ్‌ఎన్ ఎస్.పెంటమ్మ, హెచ్.వి. ఎస్.రుక్మిణి, ఫార్మశిస్టు టి.లీలారాణి, ల్యాబ్ టెక్నీషియన్లు వై.నాగరాజు, ప్రేమ్ పాల్గొన్నారు.

క్రీడాదుస్తుల వితరణ



క్రీడాదుస్తులతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఇచ్ఛాపురం: పట్టణంలోని పురుషోత్తపురం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న జె.ఫల్గుణరావు అదే స్కూల్‌కు చెందిన క్రీడాకారులకు మంగళవారం స్పోర్ట్స్ యూనిఫాం అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వై.లత, ఉపాధ్యాయులు దేవరాజ్, రాజగోపాల్, రాంప్రసాద్, ఈశ్వరి, సత్యవాణి, ఆదిలక్ష్మి, రాజలక్ష్మి, నీలిమ కృష్ణవేణి పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ పోటీల విజేత బెంకిలి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్

సోంపేట: మండలంలోని జింకిభద్ర పంచాయతీలో నిర్వహించిన డివిజన్ స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో బెంకిలి గ్రామానికి చెందిన కోట ధర్మారావు జట్టు విజేతగా నిలిచింది. విజేతలకు ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ మంగళవారం బహుమతులు అందజేశారు. అనంతరం జింకిభద్ర ప్రాథమికోన్నత పాఠశాల వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొని విద్యార్థులకు పలు సలహాలు సూచనలు అందజేశారు. కార్యక్రమంలో జింకిభద్ర సర్పంచ్ తామాడ పద్మావతి, హెచ్‌ఎం బి.వేణుగోపాలరావు, కొల్ల తారకేశ్వరరావు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

కిడ్నీ బాధితునికి పింఛన్ మంజూరు



ఉమాపతికి పింఛన్ అందజేస్తున్న దృశ్యం

టెక్కలి: టెక్కలి మేజర్ పంచాయతీ పెద్దబ్రాహ్మణవీధికి చెందిన బొర్రి ఉమాపతి అనే కిడ్నీ బాధితుడికి మంజూరైన పింఛన్‌ను మంగళవారం అందజేశారు. గ్రామ వలంటీర్ సింహాద్రి పాత్రో, స్థానిక జగన్నాథస్వామి ఆలయ కమిటీ మాజీ చైర్మన్ నర్సింగ్ నాథ్ సాబతో చేతుల మీదుగా రూ.10 వేలు పెన్షన్ అందించారు. డయాలసిస్ పింఛన్ మంజూరు చేయడం పట్ల సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

మహిళకు ఆర్థిక సాయం

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని తులసిగాం గ్రామానికి చెందిన కొర్లపు తేజమ్మ సోమవారం ప్రమాదవశాత్తు రోడ్డుపై కాలు జారిపడటంతో కాలు విరిగింది. ఒంటరిగా బతుకుతున్న ఈమెకు తులసిగాం యువసేన ఫౌండేషన్ ప్రతినిధులు రూ.6వేలు ఆర్థిక సాయాన్ని మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యుడు పి.ఆదిత్య పాల్గొన్నారు.

టెక్కలి పీఏసీఎస్ పరిధిలో

రూ.14.35 కోట్ల రుణాలు



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ జనకమోహన్‌రావు, సీఈఓ శ్రీమన్నారాయణదాస్

టెక్కలి: 2022–23 ఆర్థిక సంవత్సరంలో టెక్కలి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం పరిధిలో రూ.14,35,15,619 మేర వివిధ రకాల రుణాలు అందజేసినట్లు చైర్‌పర్సన్ పి.జనకమోహన్‌రావు(చంటి), సీఈఓ పి.శ్రీమన్నారాయణదాస్ తెలిపారు. మంగళవారం సొసైటీ కార్యాలయంలో విలేకరులతో వారు మాట్లాడారు. ప్రభుత్వ లక్ష్యం మేరకు ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ ఆదేశాలతో సొసైటీ పరిధిలో రైతులకు, చిరు వ్యాపారులకు స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలను అందజేసినట్లు వెల్లడించారు. రుణాలు రెన్యువల్ చేసుకున్న 2407 మందికి కొత్తగా రూ.11,19,50,619 రుణాలు అందజేసినట్లు వివరించారు. డీసీసీబీ పరిధిలో ఇప్పటికే రుణాలు తీసుకున్నవారంతా రెన్యువల్ చేసుకుని రాయితీలు పొందాలని కోరారు. డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, సీఈఓ డి.వరప్రసాద్ సహకారంతో రైతులకు, వాణిజ్య అవసరాలకు అనుకూలంగా సొసైటీ పరిధిలో రుణాలు అందజేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో కార్యాలయ సిబ్బంది నగేష్, జగన్, అమర్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

నర్తు కుటుంబీకుల భూమిపై హైడ్రామా ఆపాలి



మాట్లాడుతున్న యాదవ సంఘ ప్రతినిధులు

కంచిలి: ఇచ్ఛాపురం మండలం ఈదుపురం గ్రామానికి చెందిన నర్తు నరేంద్ర సోదరులకు తండ్రి దివంగత నర్తు శ్రీరాములు పలాస మండలం రామకృష్ణాపురం రెవెన్యూ పరిధిలో కొనుగోలు చేసిన పదెకరాల భూమిపై ప్రతిపక్ష పార్టీ నేతలు చేస్తున్న హైడ్రామాను ఆపాలని ఇచ్ఛాపురం నియోజకవర్గ యాదవ సంఘ ప్రతినిధులు డిమాండ్ చేశారు. స్థానిక రాధాకృష్ణ ఆలయం వద్ద మంగళవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ శ్రీరాములు ఈ భూమిని 1966లోనే కొనుగోలు చేసినా దానిపై ప్రతిపక్ష పార్టీ నేతలు తప్పుడు పత్రాలు సృష్టించి , ఇందులో రెండెకరాలను ఆక్రమించుకోవాలని చూస్తున్నారని, దీన్ని జిల్లా యాదవ సంఘం ఖండిస్తోందన్నారు. పలాస నియోజకవర్గంలో జరుగుతున్న పరిణామాలన్నీ ప్రజలకు తెలుసని, ఈ వ్యవహారం వెనుక ఎవరున్నారో త్వరలో తేలుతుందన్నారు. నర్తు కుటుంబానికి తాము అండగా ఉంటామని స్పష్టంచేశారు. సమావేశంలో అఖిల భారతీయ యాదవ మహాసభ రాష్ట్ర యువజన కార్యదర్శి దట్టి అజయ్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శి సాలిన లక్ష్మణమూర్తి, బొగాబెణి ఎంపీటీసీ సభ్యుడు బొండాడ వైకుంఠరావు, జాతీయ యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు బడ్డి మురళి, కొల్లి తాతయ్య, మద్దు బుద్దేశు, గణప దుర్యోధన పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు కాల్‌సెంటర్లు



మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ప్రసాద్

కంచిలి: రానున్న వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు, సమస్యలు పరిష్కరించేందుకు వీలుగా ప్రతి సచివాలయం పరిధిలో కాల్‌సెంటర్లను ఏర్పాటు చేయనున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ పి.ఎల్.ఎన్.ప్రసాద్ తెలిపారు. కంచిలి మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీడీఓ చల్లా శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో మంగళవారం సమావేశం నిర్వహించారు. కాల్ సెంటర్లకు వచ్చిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. జగనన్న ఇళ్ల వద్ద ఇంకుడు గుంతలు తప్పనిసరిగా నిర్మించాలన్నారు. సమావేశంలో హౌసింగ్ డీఈ వి.రామకృష్ణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సి.సతీష్, హౌసింగ్ ఏఈ ఎ.అప్పారావు పాల్గొన్నారు.

మహిళల రక్షణకు కృషి



మాట్లాడుతున్న ఎస్‌ఐ కె.గోవిందరావు

ఇచ్ఛాపురం: మహిళల రక్షణకు సంబంధించి ఇచ్ఛాపురం పట్టణంలోని శాంతినికేతన్, కేజీబీవీ పాఠశాలల్లో మంగళవారం అవగాహన సదస్సులు ఏర్పాటు చేశారు. జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో స్ఫూర్తి బృందం నేతృత్వంలో మహిళల భద్రత–మా బాధ్యత కార్యక్రమంపై మంగళవారం నాటికల రూపంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఉలాల భారతిదివ్య, పట్టణ ఎస్‌ఐ కె.గోవిందరావు మాట్లాడుతూ గుడ్‌టచ్–బ్యాడ్ టచ్, మహిళల అపహరణ, బాల్యవివాహాల వల్ల కలిగే నష్టాలను వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

శివాజీనగర్‌లో విద్యుత్ సమస్య పరిష్కారం



పనులు నిర్వహిస్తున్న దృశ్యం

కాశీబుగ్గ : మున్సిపాలిటీ పరిధిలోని 20వ వార్డు శివాజీనగర్‌లో వేలాడుతున్న విద్యుత్ తీగల సమస్యను అధికారులు మంగళవారం పరిష్కరించారు. ఇళ్లను ఆనుకుని వైర్లు ఉండటం, గతంలో తీగలు తగిలి ఓ మహిళ మృతి చెందడంతో విషయాన్ని స్థానికులు మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యుడు బమ్మిడి సంతోష్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సూచనల మేరకు విద్యుత్ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాలతో లైన్ ఇన్‌స్పెక్టర్ గార రాజారావు నేతృత్వంలో మూడు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తున్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు దుర్యోధన, ప్రదీప్ పండా, గృహసారథులు రాణి, చలపతిరావు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్యాలు



డ్యాన్స్ చేస్తున్న యువకులు

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని నువ్వలరేవులో శ్రీరామ నవమి ఉత్సవాల సందర్భంగా మంగళవారం యువకులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. గారడీ, పగటి వేషాలు, జానపద నృత్యాలు అలరించాయి. స్థానికులతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు తరలివచ్చి సాంస్కృతిక ప్రదర్శనలు తిలకించారు.

క్యాన్సర్ బాధితురాలికి సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

వజ్రపుకొత్తూరు: మండలంలోని బెండి గ్రామానికి చెందిన అల్లాడ మహాలక్ష్మి కొద్దిరోజులుగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతోంది. ఈమె దీనస్థితిపై సాక్షిలో ప్రచురితమైన కన్నీటి కథ కథనానికి హుకుంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు స్పందించారు. మంగళవారం బెండి గ్రామానికి వెళ్లి బాధితురాలికి రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు.

రూ.6 కోట్ల 4 లక్షలతో అభివృద్ధి పనులు

కోటబొమ్మాళి: మండలంలోని 33 ప్రభుత్వ పాఠశాలలు, ఒక ప్రభుత్వజూనియర్ కళాశాలలో రూ.6కోట్ల 4లక్షల 92వేల నిధులతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు మనబడి, నాడునేడు అసిస్టెంట్ ఇంజినీర్ ఆర్.ఆనందరావు తెలిపారు.

పారదర్శకంగా విధుల నిర్వహణ

కంచిలి: సచివాలయ ఉద్యోగులు పారదర్శకతతో విధులు నిర్వర్తించాలని పలాస ఆర్‌డీఓ తమరాల సీతారామూర్తి ఆదేశించారు. కంచిలి 1, కంచిలి 2 సచివాలయాలను మంగళవారం తనిఖీ చేశారు.

వైఎస్సార్‌బీమా తక్షణ సాయం అందజేత

కంచిలి: తలతంపర గ్రామానికి చెందిన వైశ్యరాజు మిట్టు(36) ఇటీవల మృతిచెందారు. మృతుని కుటుంబానికి మంజూరైన వైఎస్సార్ బీమా తక్షణ సాయం రూ.10వేలను ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి మంగళవారం అందజేశారు. పథకం కింద రూ.లక్ష మంజూరైనట్లు ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ జగబంధు దొళాయి, ఎంపీటీసీ సభ్యుడు బృందావన్‌సాహు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ ఆసరా సంబరాలు

టెక్కలి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో బుధవారం వైఎస్సార్ ఆసరా సంబరాలు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ ఉమాసుందరి తెలిపారు.